
*సర్వమానవ సంబంధాల్లాగే ప్రేమలూ, అభిమానాలూ గూడా ఆర్థికావసరాల వేషాలే అయినప్పుడు జీవితం కృత్రిమమైన నాటకంలాగే తయారవుతుంది. ఆదాయం కోసం పెంచుకునే పక్షుల్లాగే, సంపాదించే భార్యగా భర్త యింటికొచ్చిన స్త్రీ కూడా ప్రేమానురాగాల పేరుతో పడుతున్న సంకెళ్లను గుర్తించే స్థితిలో లేదు. పక్షుల కోసం పంజరాలను తయారుచేస్తున్నట్లే సంపాదించే స్త్రీల కోసం పంజరాల్లాంటి యిళ్లను రూపొందిస్తోంది పితృస్వామిక వ్యవస్థ.*

మధురాంతకం నరేంద్ర

# 13 మెకావో చిలుకలు





'మెకావో... మెకావో' అని కలవరిస్తూనే గౌతమ్ ముఖద్వారం పక్క నుండే కాలింగ్ బెల్‌ను మరోసారి నొక్కాడు.

తర్వాత, "మెకావోలుండే యిల్లు గదా అంకుల్! గెస్టులొచ్చినప్పుడు లోపలంతా సర్దుకున్నాకగానీ తలుపులు తెరవడం కుదరదు," అన్నాడు మూత తెరవగానే పొంగెత్తే సోడాలా వుత్సాహంగా గసలు బోస్తూ.

చల్లకొచ్చి ముంత దాచుకుంటే యింత యిబ్బంది యెదురౌతుందని నాకేం తెలుసు? యెక్కడి చిత్తూరు జిల్లా చంద్రగిరి? యెక్కడి యీ కర్ణాటక బళ్లారి పట్టణం? యింత దూరం నేను తనను చూడ్డం కోసమే వచ్చానని అంటే యేం బావుంటుంది? గౌతమ్ అడిగిన ప్రశ్నకు యేదో వొక సమాధానం చెప్పి తప్పించుకోవడమే నా వుద్దేశమప్పుడు.

మూసిన తలుపుల్ని ముచ్చటగా చూస్తూ, "యీ వూర్లోనేగాదు, యీ యేరియా లోనే మెకావోలుండే యిల్లిదొకటే అంకుల్! యెవరికి పడితే వాళ్లకు మెకావోల్ని అమ్మరు. కొత్తవాళ్లను యింట్లోకి రానీరు. దేవుడే పంపించినట్టుగా వచ్చారు మీరు," అన్నాడు గౌతమ్. "మా ఫాదర్ పంపించిన ఫ్రెండని మీరంటే నేను ముందు మిమ్మల్ని పెద్దగా పట్టించుకోలేదు. ఆయనకేమో డయాబిటెస్. కానీ యీ వూర్లో జీకే స్వీట్ స్టాల్లో దొరికే నువ్వుల వోలిగలంటే యిష్టం. యీవూరి కెవరొచ్చినా వాటిని తీసి పంపించమని స్టాండింగ్ యిన్‌స్ట్రక్షన్ యిచ్చేశారు. మీ దగ్గర కూడా పంపించక తప్పదు. అందుకే మీ తిరుగు ప్రయాణమెప్పుడని అడిగాన్నేను. మీరు బనశంకరి వీధిలో వుండే బంధువుల యింటికెళ్లాక అనగానే నాకనుమానం వచ్చింది. దేవరాజు అనే పేరు చెప్పగానే అది మెకావోల యిల్లేనని తెలిసిపోయింది."

గాలికి పరదా తొలిగినంత నిశ్శబ్దంగా తలుపు తెరుచుకుంది. తెల్ల పైజామా జుబ్బాలు తొడుక్కున్న నడి వయస్సు వ్యక్తి తొంగి చూశాడు.

బాగా పాతబడిన జ్ఞాపకాల్ని వెతుక్కుంటూ, "నమస్తే! నేనండీ! హరేరాంగారి అబ్బాయిని... హంసవేణి నాకు కజినవుతుంది," అని వినయంగా పరిచయం చేసుకున్నాను.

దేవరాజు కళ్లు చిట్లించుకుని చూశాక, "మీరా! రండి...!" అంటూ పక్కకు తప్పుకున్నాడు.

సన్నగా పొడుగ్గా వున్న వరండానే హాలుగా మార్చి, దానికొక చివర్లో సోఫాలూ, కుర్చీలూ సర్దుకుని వున్నాయి. వరండాలోని చాలా భాగాన్ని బీరువాలూ, అలమరాలూ ఆక్రమించుకునేశాయి. గోడ పక్కనున్న చెక్క బెంచీపైన రకరకాల గుడ్డపేలికలు కుప్పలు కుప్పలుగా పడి వున్నాయి. అదోరకపు నీసు వాసన పైన అప్పుడే చల్లిన రూం ఫ్రెషనర్ నీరసంగా గుబాళిస్తోంది.

చిరాకు పడుతున్నట్టున్న దేవరాజు ముఖంలోకి బెరుకుగా చూస్తూ, "ఆఫీసు పనిమీద యీ వూరొచ్చాను. కాస్త తీరిక దొరికితే, చూసి చాలా రోజులైపోయిందని..." అంటూ అవసరానికి మరో అబద్ధాన్ని జోడించాను.

అతనదోలా పెదవుల్ని వంకరగా సాగదీసి, "అంతా బావున్నారా? వుండండి. తనని పిలుస్తాను," అని ద్వారం దగ్గరి తలుపును బలంగా లోపలికి తోశాడు.

సోఫాలో కూర్చుంటూ, "మెకావోల పంజరాల్ని రోజూ శుభ్రం చెయ్యాల్సిందే అంకుల్. ఆ నేప్‌కిన్‌లంతా అందుకే!" అన్నాడు గౌతమ్ పాత గుడ్డపేలికల్ని ప్రేమగా చూస్తూ.

హంసవేణిని తలచుకున్నప్పుడల్లా నాకు మా పెదనాయినే గుర్తుకొస్తాడు. ఆయనకు నలుగురమ్మాయిలూ, వొక కొడుకూ సంతానం. హంసవేణి అందరికంటే చిన్నది. రచ్చపై కూర్చున్న రాజేంద్ర భోగి, నిక్షేపరాయడు, మొదలైన పడికట్టు మాటలు బహుశా మా పెదనాయినలాంటి వాళ్లను చూసే పుట్టుంటాయి. రైస్‌మిల్లును మేనేజరు భాషా, యింటిని మా పెద్దమ్మా నడపుతూంటే ఆయన వేదాంతిలా యేమీ పట్టనట్టుగా తిరిగేవాడు. మిల్లు ముందో, యింటి దిన్నె పైన్నో కూర్చుని బైరాగిలా యెప్పుడూ బీడీలు తగలేసేవాడు.

అయిదారు నిముషాల తర్వాత హంసవేణి వరండాలోకొచ్చింది. పాదాలను కూడా కనిపించనివ్వని నైటీలో ఆమె శరీరం అలసిపోయినట్టుగా కనిపించడానికి వయస్సు మాత్రమే కారణమనిపించడం లేదు. కాగితం పువ్వులాంటి నవ్వొకటి నవ్వి, "వదినా, పిల్లలూ కులాసానా అన్నా!" అని పలకరించింది.

నేను తల వూపి, ''యీ అబ్బాయి గౌతమ్. యిక్కడే కెనరా బాంకులో వుద్యోగం చేస్తున్నాడు. మెకావోలు - అదే గదా వాటిపేరు? మీ యింటికొస్తున్నానంటే వాటికోసం నాతోబాటు వచ్చాడు,'' అని పరిచయం చేశాను.

దేవరాజు లోపలినుంచి వరండాలోకొచ్చి, ''పెట్ బర్డ్స్ కోసరమా? చూడ్డానికా?'' అని అడిగాడు.

''కొనడానికి సార్!... రెండు వారాల క్రితం మీకు యీ మెయిల్ గూడా యిచ్చాను,'' అన్నాడు గౌతమ్ లేచి నిల్చుంటూ.

''అయితే మా సన్నీ రావల్సిందే! పిలుస్తానుండండి,'' అంటూ దేవరాజు భార్య కేసి చూశాడు. ఆమె తల వూపుకుంటూ లోపలికెళ్లింది. అతనూ ఆమె వెంటే లోపలి కెళ్లిపోయాడు.

''పెట్స్‌ను అమ్మతారా? నాతో వచ్చావు గదా! నీ దగ్గర డబ్బులు తీసుకోరులే!'' అన్నాను గౌతమ్‌తో.

''భలే వారే అంకుల్! వొక్కో మెకావో ఖరీదు లక్షల్లో వుంటుంది. వూరికే యెవరూ యివ్వరు,'' అంటూ గౌతమ్ నవ్వేశాడు.

హంసవేణి దర్జాగా బతుకుతోందని అనుకున్నానుగానీ, యింత ఖరీదైన పెంపుడు పక్షుల యింట్లో దర్బారు చేస్తోందని తెలియదు నాకు. యీ అమ్మాయి పెళ్లి కోసం మా పెదనాయిన కాళ్లరిగేలా తిరగడం గుర్తుంది. పెద్దమ్మాయిని మా అత్త కొడుకే చేసుకున్నాడు. పక్క వూళ్లో వుండే బంధువులబ్బాయికి రెండో అమ్మాయి నిచ్చేశారు. మూడో అమ్మాయిని మా వూళ్లోనే వున్న వో అబ్బాయికి- అతగాడిది మా కులమే గానీ తెగ వేరు- యిచ్చేయడానికి సిద్ధమైపోయాడు. చివరికో తల మాసిన సంబంధం వచ్చి ఆ అమ్మాయి కడతేరిపోయింది. ఆడపిల్లనివ్వడానికి ఆ వచ్చినవాడు మగవాడైతే చాలునన్నది మా పెదనాయిన నమ్మకం. కానీ అప్పటికే బాంకు వుద్యోగం చేస్తున్న యీ చివరి అమ్మాయికి అంత సులభంగా సంబంధం కుదర్లేదు. చివరికి అప్పుడు పుంగనూరు బాంకులో పనిచేస్తూన్న యీ దేవరాజు దొరికాడు. అయితే అతడు కేవలం అటెండరుద్యోగంలో వున్నాడు. వయస్సు కూడా అమ్మాయి కంటే సంవత్సరమో, రెండేళ్లో తక్కువన్నారు. అయితే యివేవీ మా పెదనాయినకు అడ్డంకులుగా కనిపించలేదు. పెళ్లయిన ఆరు నెలలకే దేవరాజు భార్యను తానుండే ఊరికి బదిలీ చేయించుకున్నాడు.

కళ్లజోడు తగిలించుకున్న బక్క పలచటి యువకుడు గుమ్మం వరకూ వచ్చి లోపలికి రమ్మనట్టుగా సైగ చేశాడు. నేనూ, గౌతమూ లోపలికెళ్లాం. లోపలి హాలు

నంతా చిన్నది చేసి పారేస్తున్న గది దగ్గరికెళ్లి తలుపులు తీశాడు సన్నీ. ముందుగా చెవులు చిల్లులు పడేలా పక్షుల గోల ముంచుకొచ్చింది. గదినంతా ఆక్రమించుకున్న పెద్ద యినపకమ్మీల బోనులోపల అమర్చిన లావుపాటి చెట్ల కొమ్మలపైన ఆరేడు చిలకలు రెక్కలల్లారుస్తూ అరుస్తున్నాయి. రెండు మూడడుగుల పొడవూ వెడల్పులున్న ఆ చిలకల శరీరాల కంటే తలలు పెద్దవిగానూ, ముక్కులు వుక్కుతో చేసినట్టు బలిష్టంగానూ, కళ్లు కోపంగా చూస్తున్నట్టు నిగారింపుతోనూ వున్నాయి. పై కప్పులాగున్న కమ్మీలనుంచీ వేలాడుతున్న యినప పళ్లెరాల్లో వికారంగా కొరుకుళ్లుపడ్డ పండ్ల ముక్కలూ, రకరకాల గింజలూ చిందరవందరగా పడివున్నాయి. దట్టమైన రంగుల యీకలతో, భయాన్ని రేకెత్తించే అందంతో ఆ పక్షులన్నీ వొక్కుమ్మడిగా మా పైకి దాడి చేయడం కోసం ముందుకెగురుతున్నాయి.

"యింత పెద్ద చిలకలుంటాయని నాకు తెలియదు," అన్నాను.

"వొకప్పుడు ఆఫ్రికా, మెక్సికో దేశాల్లో మాత్రమే వుండేవివి. పెట్ బర్డ్స్ అయ్యాక యిప్పుడు ప్రపంచమంతా వున్నాయి. ఆ నీలం రెక్కలూ, పసుపు తోకా వుండేది బ్లూ అండ్ గోల్డ్ మెకావో... వొళ్లంతా పచ్చగా, ముక్కుదగ్గర యెరుపూ, రెక్కలకింద నీలం రంగూ - అది మిలిటరీ మెకావో. దాని పక్కనున్నది స్కార్లెట్... యిది హెమింగ్వే... యిప్పుడు క్రాస్ బ్రీడింగ్ యెక్కువై కొత్త కొత్త రకాలవి వస్తున్నాయి. వాటికి పేరెంట్స్ రెండింటి లక్షణాలూ వస్తాయి" తనలో కొత్త విద్యుత్తేదో పాకుతున్నట్టుగా సన్నీ వుత్సాహంతో చెప్పుకుపోయాడు.

"మామయ్యకు నమస్కారమైనా చెప్పావా లేదా సన్నీ నువ్వు? వీడికి యీ మెకావోలు తప్ప యింకో లోకం వుండదన్నా! కాఫీ తీసుకో ముందు," అంటూ హంసవేణి కప్పుల ట్రే తీసుకొచ్చింది.

"నేను కాఫీగత ప్రాణినని నీకింకా గుర్తుందామ్మా!" అని మెచ్చుకున్నాను.

"మీ సిస్టర్ యేదీ మరవదు. అదే చిక్కంతా. కావాలంటే మీ వూర్లో వాళ్ల పెరట్లో యేయే మొక్కలున్నాయో అడగండి. పొల్లు బోకుండా చెప్పేస్తుంది," అన్నాడు దేవరాజు మెచ్చుకుంటున్నాడో, విమర్శిస్తున్నాడో అర్థంగాని ధోరణిలో.

కాఫీ తాగుతూ వరండాలోకొచ్చి, "యీ మధ్య ముఖ్యమైన పెళ్లిళ్లకూ దేవర్లకూ గూడా రావడం లేదు మీరు!" అన్నాను.

"పుట్టిల్లనే భ్రమ యెవరికుండదు? అయితే తీసుకోవడమే తప్ప యివ్వడం తెలియని వాళ్లతో యెంతకాలమని వేగాలి?" అన్నాడు దేవరాజు విసుగ్గా.

"నిజమేలెండి! మా పెద్దనాయిన కాలమయినాక జగదీష్ రైసుమిల్లు గూడా అమ్మేశాడు. వున్న పొలమంతా అమ్ముకు తినేశాడు. యిప్పుడు సంపాదన కోసం రాజ

కీయాల్లో తిరుగుతున్నాడు. యెవరు కనిపిస్తే వాళ్ల జేబులోకి చెయ్యిపెడతాడు. ఆ అక్కలు గూడా అట్లే తయారైనారు. యెప్పుడూ అప్పులనీ, బాంకులనీ, స్యూరిటీలనీ తిరగతారు,'' అని నేనతడినే సమర్థించాను.

హంసవేణి వచ్చి భర్త నానుకుని కూర్చుంది.

ముందుగా మెకావో అరుపులూ, తరువాత దాన్ని భుజానికెక్కించుకున్న సోనీ, అతడి వెనకే మెకావోను పలకరిస్తూ గౌతమూ వరండాలోకొచ్చారు.

''యీ అరుపులు పక్కిండ్లకు వినబడకుండా తలుపులు మూసేస్తాం. మెకావోలకు భలే తెలివి. కొత్తలో బెరుగ్గా వుంటాయి. కానీ మాలిమయితే వదలిపెట్టవు. యజమాని కావల్సినంత సమయం కేటాయించకపోతే ఆగడం చేస్తాయి. నమ్మకంలో కుక్కలతో పోటీపడతాయి. పిల్లుల్నీ, యెలకల్నీ, వుడతల్నీ- చివరకు కుక్కల్నీ గూడా తరిమి పారేస్తాయి. వోపిగ్గా నేర్పిస్తే మాటలు నేర్చుకుంటాయి. మన గొంతుల్ని యిట్టే యిమిటేట్ చేస్తాయి,'' అంటూ సన్నీ గౌతమ్‌కు వివరించసాగాడు.

''మీ అత్తామామా యెక్కడున్నారు?'' అని అడిగాను.

హంసవేణి భర్త చేతిని గట్టిగా పట్టుకుంటూ, ''వాళ్లు పోయి చానా రోజులై పోయింది. మా జగదీషన్న యీ మధ్యొకసారి వచ్చాడు. అర్జెంటుగా కాష్ కావాలన్నాడు. నన్నయితే యేమారించి లాక్కుపోయేవాడే! అకౌంట్లూ, డిపాజిట్లూ, సాలరీ యీ గొడవంతా నాకు మారేజీతోనే పోయింది. జగదీషన్న అలిగి చెప్పకుండానే వెళ్లి పోయాడు. అంతా మన మంచికేలే! యిప్పుడెవరూ రావటం లేదు. పెద్దక్కెప్పుడైనా ఫోను చేస్తుంది. చిన్నక్క కూతురి పెళ్లికి పత్రిక గూడా పంపించలేదు. యేమని అడిగితే పంపిస్తే మాత్రం వస్తావనా అని యెగరేసి మాట్లాడింది,'' అంది.

ఆమె గొంతులో ఆవేదనకంటే ఆనందమే యెక్కువగా ధ్వనిస్తోంది.

సన్నీ మెకావోను తండ్రి భుజంపైన కూచోబెట్టి లోపలికెళ్లాడు.

అంతవరకూ మరచిపోయిన సంగతి జ్ఞాపకం రాగానే, ''అవునమ్మా! నీ కోడలెక్కడ? నీ కూతురెక్కడ?'' అని అడిగాను.

''నువ్వు వాడి పెళ్లికి రాలేదు. శ్రావణి- మా కోడలు గూడా సన్నీలాగే లెక్చరరు. ధార్వాడ్‌లో పనిచేస్తోంది. రెండు వారాలకోసారి ఆ పిల్లే యిక్కడికి వచ్చి వెళ్తుంది. సన్నీకి మెకావోల్ని విడిచిపెట్టి వెళ్లడం కుదరదు. మా శ్రావణికి గూడా నా రాతే! వాళ్ల పేరంట్స్ హైద్రాబాద్‌లో వుంటారు. కూతుర్ని పట్టించుకోరు. స్వీటీ- మా అమ్మాయి, యిక్కడే బాంకులో క్లర్కు. ఆదివారం గదా, పీవో కోచింగుకు వెళ్లింది,'' అంది హంసవేణి. వాళ్ల సన్నీ పెళ్లి ఆహ్వానపత్రిక పెళ్లి జరిగిపోయిన వారం తర్వాత నాకందిందన్న విషయం నాకు గుర్తుకొచ్చింది.

మరో మెకావోను చేతిపైకెక్కించుకుని సన్నీ వరండాలోకి రాగానే, ''నాకీ మిలిటరీ మెకావోనే కావాలి,'' అన్నాడు గౌతమ్.

''దీని వయస్సు మూడేళ్లు! పెద్దదయింతర్వాత దీన్ని అదుపులో పెట్టడం చాలా కష్టం. దీని ముక్కు చూడండి. కొబ్బరికాయను గూడా పగలగొట్టేస్తుంది,'' అన్నాడు సన్నీ మెకావో ముక్కుకు తన పెదవిని చేర్చి ముద్దు పెట్టుకుంటూ.

''యీ మెకావోలు అన్ని పెట్స్ లాంటివి గావనే నేను వెతుక్కుంటూ వచ్చింది సన్నీగారూ! వీటిని గురించి నేను రీసెర్చి చేసి పారేశాను. యివి డెబ్బయి యెనభ య్యేండ్లు బతికేస్తాయి. వీటికి ప్రతిరోజూ షవర్‌తో స్నానం చేయించాలి. యెప్పటి కప్పుడు కొత్త కొమ్మల్ని తెచ్చి పెట్టాలి. కొమ్మలతోబాటు అవి బంకమన్నూ, పండ్లూ, గింజలూ, చికెనూ తింటాయి. యెక్కువసేపు వదలిపెట్టి పోగూడదు. వొకరిద్దరి కంటే యెక్కువమందితో అవి సర్దుకుపోవు. కోపమొచ్చినప్పుడు యివి చచ్చిపోయినట్టు నీలిగి పడుకుని యేమారిస్తాయి. కొత్త వెహికల్సూ, కొత్త మనుషుల్నీ దూరం నుంచి కనిపెట్టి గోల చేస్తాయి. సన్ సెటింగప్పుడు గగ్గోలు పెట్టేస్తాయి,'' పరీక్షకు కూర్చున్న విద్యార్థిలా గౌతమ్ వుత్సాహంగా వొప్పగించాడు.

ఆ యువకులిద్దరినీ విసుక్కోకుండా వుండడానికి ప్రయత్నిస్తూ, ''యీ పక్షులు మీ యింటినంతా ఆక్రమించేసుకున్నట్టున్నాయి గదమ్మా! యిక యెవరైనా గెస్టులొస్తే కష్టమే!'' అని సానుభూతి చూపెట్టబోయాను.

''యీ యిల్లు కట్టుకున్నాక మాకు గెస్టుల బాధ తప్పోయిందిలేన్నా! యింతకు ముందు వర్షా నగర్లో రెంటెడ్ హౌవుసులో వుండేవాళ్లం. ఆ యింట్లో వుండేటప్పుడే నాన్నొచ్చారోసారి. యేదో పని పైన వచ్చినట్లే కనిపించింది. కానీ రెండు రోజులుండి ఆ తరువాత యేమీ చెప్పకుండా వెళ్లిపోయాడు. ఆయన పోయిన రెండేళ్ల తర్వాతోసారి అమ్మ గూడా వచ్చింది. నెలదాకా వుంది. యెప్పుడూ చిన్నక్కకు జరగటంలేదనీ, పెద్దక్క కొడుకు చదువుకు డబ్బులు పంపమనీ, జగదీషన్న వ్యాపారానికి పెట్టుబడి కావాలనీ వేదించుకు తింది. మా సన్నీ ఆమె వెళ్లిపోయిన తర్వాత గూడా చాలారోజులపాటు అమ్మమ్మా అమ్మమ్మా అని కలవరించాడు. ఆ యింట్లో వున్నప్పుడే వీడికీ మెకావోలతో ఫ్రెండ్‌షిప్పయింది. యీ యిల్లు కట్టుతున్నప్పుడే మెకావోల కోసం స్పెషల్ రూములు కట్టాము,'' హంసవేణి మొగుణ్ణీ, కొడుకునూ కళ్లు మెరుస్తూండగా ఆనందంగా చూస్తూ చెప్పుకుపోయింది.

జేబులోంచీ చాక్లెట్ తీసి మెకావోకు తినిపించబోయిన గౌతమ్‌ను వారిస్తూ, ''యిదంత త్వరగా మచ్చికవదు. ఫిజికల్ టచ్‌కీ హాండ్ ఫీడింగుకు అలవాటు పడాలి.

తర్వాతే ట్రీట్స్... కావల్సినంత వ్యాయామముండాలి. బొమ్మసైకిళ్లు తొక్కడం, వూయల లూగడం లాంటివి. వాటికి చీకాకు పుడితే రెక్కలు పీక్కుంటాయి. పెద్దగా అరస్తాయి. గాలీ వెలుతురు బాగా వుండాలి. అప్పుడప్పుడూ షికారు తిప్పాలి,'' అన్నాడు.

''యివి రెండు గుడ్లే పెడతాయి గదా!'' గౌతమ్ బుద్ధిమంతుడైన విద్యార్థిలా ప్రశ్నించాడు.

''అంతే! వీటిలో యేది ఆడో యేది మగో మనకు డీయెన్నీ చేస్తేగానీ తెలియదు. అవి మాత్రం సులభంగా జోడీని తెలుసుకుంటాయి. యిరవై ఆరు నుంచి నెలరోజుల దాకా పొదగతాయి. గుడ్డులోంచి వచ్చే పిల్లలు చింపిరి చింపిరిగా వుంటాయి. రెండు నెలల్లో అందంగా తయారైపోతాయి...''

''మీ సన్నీ పుట్టింది మన చంద్రగిరిలోనే కదమ్మా!'' అని అడిగాను, మెకావోల ప్రపంచం నుంచి తప్పించుకోవడం కోసం.

''డెలవరీకయితే చంద్రగిరికొచ్చాన్లేన్నా!! యీయనక్కడికొచ్చారప్పుడే! ఆ యింట్లో నాకేమీ అమరడం లేదని వెంటనే తీసుకొచ్చేశారు. వీడు పుట్టిందిక్కడే ఆస్పత్రిలో,'' అంది హంసవేణి.

''అంత సులభంగా రాలేదు లెండి యీమెగారు! మొదట్లో భలే కీచులాడేది. పెళ్లయిన కొత్తలో సరిగ్గా మనస్సు విప్పి మాట్లాడేది కూడా కాదు. యెందుకలిగేదో, యెందుకు విసుక్కునేదో తెలిసేదిగాదు. బ్రతిమాలీ, బేలించి యిలా తయారు చేసుకునేసరికి నా తలప్రాణం తోకకొచ్చింది,'' అన్నాడు దేవరాజు నవ్వేస్తూ.

''యీ హెమింగ్వే యీకలు నలిగిపోయి వున్నాయి. ఆరోగ్యం బాగలేదేమో...'' అని వాకబు చేస్తూ గౌతమ్ దాని రెక్కలు పట్టుకోబోయాడు. అది అమాంతంగా వెనక్కు తిరిగి అతడి వేలు కొరికేసింది. గౌతమ్ కెవ్వుమని అరస్తూ వెనక్కు వొరిగిపోయాడు. అతడి బొటన వేలినంతా తడిపేసిన రక్తం మోచేయి దాకా ధారగా కారసాగింది.

''కొత్తవాళ్లు దగ్గరికొస్తే డేంజరన్నాను గదా! అప్పటికెంతో మేలు. వేలు తెగి పడలేదు. వెంటనే డాక్టరు దగ్గరికెళ్లి యేటీయెస్ యింజెక్షను చేయించుకోండి,'' అన్నాడు సన్నీ విసుగ్గా.

హంసవేణి తీసుకొచ్చిన తడిగుడ్డను వేలికి చుట్టుకుంటూ, ''పెద్దగాయమేం కాదు లెండి... పర్వాలేదు...'' అన్నాడు గౌతమ్ బలవంతంగా నవ్వడానికి ప్రయత్నిస్తూ.

''యిది నిన్నటినుంచీ సరిగ్గా తినడం లేదు. కడుపు కిందికి వేలాడుతోంది. వెట్ వాళ్లింట్లో దొరుకుతాడు. వెళ్లి దీనికేదైనా మందు తీసుకొచ్చేస్తానిప్పుడే!'' అంటూ సన్నీ చెప్పులు తొడుక్కుని సన్నద్ధమైపోసాగాడు.

“అలాగే వస్తూ వస్తూ దారిలో యిన్స్టిట్యూట్‌కెళ్లి స్వీటీని గూడా యెక్కించుకురా!” అన్నాడు దేవరాజు.

గౌతం చివాలున పైకి లేచి, “కార్లో వెళ్తున్నారా? నేనూ వస్తాను. వెటర్నరీ డాక్టరుతో పరిచయం కూడా చేసుకోవచ్చు,” అంటూ బయటికెళ్లాడు.

“మీ స్వీటీకి కూడా మెకావోలంటే యింతే యిష్టముందా?” అని వేళాకోళంగా అడిగాను.

“తప్పుతుందాన్నా! ఆదివారమని యిలా వున్నాం. వుదయాన్నే అన్నీ చేసుకుని నలుగురమూ డ్యూటీలకు పోవాలి. అందుకే మేం లేనప్పుడు పెట్స్‌ను చూసుకోడానికో మనిషిని పెట్టుకున్నాం. వాచ్‌మేను గూడా వాడే! జీతమెంతిస్తున్నామో చెప్తే నువ్వు నమ్మవు,” అంది హంసవేణి.

యింటి బయట కారు బయల్దేరిన శబ్దం వినిపించింది.

లోపలినుంచి పక్షులు పెద్దగా అరవసాగాయి. దేవరాజు పరిగెత్తుతున్నట్టుగా లోపలికెళ్లాడు. “వాటికి ఫుడ్ టయమయ్యిందన్నా! అన్నీ నేనే తీసివ్వాలి,” అంటూ హంసవేణి గూడా లోపలికెళ్లింది.

వరండాలో నేనొంటరిగా మిగిలిపోయాను. మా వూళ్లో మా యిల్లూ మా పెదనాయిన యిల్లూ పక్కపక్కనే వుండేవి. మా వంతుకొచ్చిన పొలంతో మా నాయిన సతమతమయ్యేవాడు. మా పెదనాయిన ఆయనకేమీ సహాయం చేసేవాడు కాదుగానీ మా యింట్లో యే విశేషం జరిగినా తానే పెద్దగా తయారై కారుబారు చేసేవాడు. యిప్పటికి గూడా మా పెదనాయిన పిల్లలందరూ నాతో చనువుగానే వుంటారు. యీ హంసవేణి వొక్కతే మినహాయింపు. దాదాపు ముప్పయ్యేళ్ల తర్వాత వాళ్లింటికిలా రావలసి వచ్చింది నాకు. యీ మధ్యకాలంలో మా కుటుంబాల్లో చాలా విశేషాలే జరిగాయి. ఆవిడకు వినే ధ్యాస వుంటే చెప్పాలనే వుంది నాకు. అయితే ఆవిడకు నా సొద వినాలని లేదు. పుట్టింటివాళ్లతో ఆమె ఆత్మీయంగా వుండడం ఆమె భర్తకిష్టం లేదేమో! కాకపోతే భర్త తప్ప మరేమీ ఆమెకు పట్టదేమో! గౌతమ్ కోసమని వచ్చి యిలా యిష్టంలేని అతిథిలా తయారయ్యాను నేను! గౌతమ్ యెప్పుడు తిరిగొస్తాడో తెలియదు. కాలం మెకావోలకు వేడుకగానూ, నాకు వేదనగానూ దొర్లుతోంది.

టెలిఫోను బిగ్గరగా మోగింది. బీరువాల పక్కన అంతవరకూ దాక్కున్నట్టున్న దాని పొలకువ అప్పుడుగానీ తెలిసి రాలేదు. దేవరాజు నీడలా గబగబా వచ్చి టెలిఫోను తీసుకున్నాడు. “హలో... అవును లేదు... కాదు... వూహూ ఆహా! సరే... యిప్పుడా?... అవునా? అలాగే ఓకే... నోనో...” అంటూ అతను సంభాషణను ముగించి మళ్లీ

లోపలికెళ్లాడు. అయిదు నిముషాల తర్వాత పాంటూ షర్టూ తగిలించుకుని బయటి కొచ్చాడు. "మా బ్రదర్స్ ఫోను... అర్జెంటు పని... వెళ్లాలి... తొందరగానే వచ్చేస్తాను," అని చెబుతూనే బయటికెళ్లిపోయాడు కాస్సేపటి తర్వాత స్కూటరు బయల్దేరిన శబ్దం వినిపించింది.

హంసవేణి వరండాలోకొచ్చి కూర్చుంటూ, "మాకు యీ వూర్లోనే గాంధీనగర్లో మా మామ కట్టించిన యిల్లుంది. మా అత్తామామా పోయాక ఆ యింట్లో మా మరిదే వుంటున్నాడు. దాంట్లో మాకూ, మా బావకు గూడా హక్కుంది గదా! అందుకని ఆ యిల్లును యిప్పుడు అమ్మకానికి పెట్టేశాం... యెవడో బ్రోకరు వచ్చాడు రమ్మని యిప్పుడు ఫోను. మనం పోకపోతే వాళ్లేమైనా చేసేస్తారు. అందుకే యీయన ఆదరా బాదరాగా వెళ్లారు," అంది.

మాటలు కలపడం కోసం యథాలాపంగా, "మీ స్వీటీ పెళ్లెప్పుడమ్మా!" అని అడిగాను.

ఆమె అదోలా చూసి, "అమ్మాయి మంచి వుద్యోగం చేస్తోంది. బంగారు బాతు. సులభంగా దొరికేస్తుందిలే అని చాలామందే వచ్చి అడిగారు. అన్నీ నచ్చిన సంబంధం కుదిరితేగానీ ఆయనా, సన్నీ వొప్పుకోరు," అందామె.

వున్నట్టుండి నాకు మా అబ్బాయి గుర్తుకొచ్చాడు. నేనిలా వాళ్లింటికి రావడం వెనక నాలో యిలాంటి దురుద్దేశమేదో వుందని ఆమె అనుమానిస్తూందేమో!

యింటికంతా నేపథ్య సంగీతంలా వినబడుతున్న పక్షుల అరుపులు వున్నట్టుండి మరింత బిగ్గరగా మోగసాగాయి.

"యీ మెకావోలెందుకో యీరోజు చిర్రెత్తుకుపోతున్నాయి," అంటూ ఆమె మళ్లీ లోనికెళ్లిపోయింది.

మెకావోలు తమ యజమానుల మూడ్‌లనే ప్రతిఫలిస్తాయని గౌతం అనడం గుర్తుకొచ్చింది. తమ ఆదివారాన్ని నేనూ, గౌతమ్ యిలా వచ్చి పాడు చేసినందుకు హంసవేణి గూడా తన భర్తలాగే లోలోపల విసుక్కుంటూందేమో! లోపల మెకావోలు ఆగి ఆగీ అరుస్తున్నాయి. వరండాలో టికుటిక్కుమంటున్న గోడగడియారం ముందు వొంటరి పావురంలా బిక్కు బిక్కుమంటూ కూర్చున్నాను.

అరగంటను వొక యుగంలా వేగించిన తర్వాత బయట కారు ఆగిన శబ్దం వినిపించింది. మరో యుగంలా సాగిన అయిదు నిముషాల తర్వాత ముంజేతిపైన మెకావో నెక్కించుకున్న సన్నీ యింట్లోకొచ్చాడు. అతడి వెనకే మెకావోను పలకరించు కుంటూ గౌతం వచ్చాడు. సన్నీ మెకావోతోబాటు లోపలికెళ్లిపోయాడు.

‘‘ఆ వెటర్నరీ డాక్టరే నాకూ యింజెక్షను చేశాడంకుల్. యెంత పెద్ద బాండేజీ కట్టాడో చూడండి,’’ అన్నాడు గౌతం చిటికెన వేలు చూపెడుతూ. ‘‘దారిలో వస్తూ వస్తూ వాళ్ల స్వీటీ వెళ్తున్న కోచింగ్ యిన్స్టిట్యూట్‌కెళ్లాం అంకుల్. ఆ బాచీనంతా యెక్కడో కంప్యూటర్ సెంటరుకు తీసుకెళ్లారట. ఆమె లేదు,’’ అన్నాడు దీనంగా ముఖం పెట్టి. ‘‘యెలాగూ వెళ్లాం గదా అని నేను గూడా కోచింగుకు అడ్వాన్సు కట్టేశాను,’’ అన్నాడతను యీసారి ఆనందంగా.

నాకదివరకూ వున్న అనుమానం మరింతగా బలపడసాగింది. బంధుత్వాన్ని వెతికితే గౌతమ్‌కూ, స్వీటీకీ వరస కూడా లేదు. అయితే మనుషులకున్నట్టుగా మెకావోలకా పట్టింపులు వుండవన్నాడు గౌతం యిదివరకే!

అయినా వావివరసలదేముంది? వాటిని యెలా కావాలంటే అలా మార్చ గలిగిన వాళ్లెందరో వున్నారిప్పుడు.

‘‘యిలా యిబ్బంది పెట్టే మెకావోల్ని పెంచుకోడమెందుకు? శ్రమా ఖర్చూ...’’ అని విసుక్కున్నాను.

‘‘భలేవారే అంకుల్ మీరు! యివి పెంపుడు పక్షులుగానే మనింటికొస్తాయి. తర్వాత పిల్లల్ని పెట్టి లక్షల్ని మోసుకొస్తాయి,’’ అంటూ గౌతమ్ నవ్వేశాడు.

నేను అతడి ముఖంలోకి పరీక్షగా చూస్తూ, ‘‘స్వీటీ- అదే వీళ్లమ్మాయి, నీకు పరిచయమేనా గౌతం?’’ అని అడిగాను.

‘‘దూరంనుంచి వొకటి రెండుసార్లు చూశానంకుల్. ఆమె అంటే అందరికీ హడలే! వాళ్ల మేనేజరొకడు అతి చనువు తీసుకోబోయాడట వోసారి. అప్పుడామె యిచ్చిన కంప్లయింటుతో దిమ్మతిరిగి బదిలీ చేయించుకుని వెళ్లిపోయాడట! యెంతో డిటెక్షన్ చేస్తేనే నాకీ యింటి అడ్రస్సు దొరికింది,’’ అన్నాడతను.

తీసుకొచ్చిన మెకావోను పంజరంలో వదలిపెట్టి, మరో మెకావోను భుజం పైకెక్కించుకుని వరండాలోకొచ్చాడు సన్నీ. ఆ మెకావో ముక్కుకు జాంపండు ముక్క నందిస్తూ హంసవేణి కూడా వచ్చింది.

నేను పైకి లేచి, ‘‘యిక వెళ్తానమ్మా! రైలుకు టయమయ్యింది,’’ అన్నాను.

‘‘మా స్వీటీ యింకో అరగంటలో వస్తుందన్నాడు సన్నీ... ఆగి భోంచేసి వెళ్లగూడదాన్నా! లేకలేక వచ్చావు,’’ అంది హంసవేణి.

‘‘మీ రైలు సాయంత్రమన్నారు గదా! ప్రోగ్రాం మార్చేశారేమిటి?’’ అన్నాడు గౌతమ్ హుంకరిస్తూ. తర్వాత యిబ్బందిగా పైకి లేచి, ‘‘మీరెప్పుడు చెప్తే అప్పుడు మనీ మీ అకౌంటుకు ట్రాన్స్‌ఫరు చేస్తానండీ! వొకటి రెండుసార్లు వచ్చి వెళ్తేనే ఆ

మెకావో మచ్చికవుతుంది. నాతోబాటూ మా యింటికి వచ్చిందంటే చాలు, తర్వాత దాన్ని వదిలిపెట్టకుండా జాగ్రత్తగా చూసుకుంటాను,'' అన్నాడు గౌతం సన్నీతో.


మా అమ్మాయికి వరుణ్ణి వెదుక్కుంటూ, గౌతమ్‌ను నేరుగా చూడ్డానికీ వూరొచ్చానని గౌతమ్‌కు చెప్పకపోవడమే మేలయ్యింది. ముంజేతి మీద చిలకలా, యెన్నుపైన గువ్వలా భార్యల్ని ప్రేమగా చూసుకునే వాళ్లుంటారని విన్నాను. మార్కెట్టులో బాగా ఖరీదు పలికే మెకావోలను మాత్రమే పెంపుడు పక్షులుగా కావాలనుకునే వ్యక్తులున్నట్టు యిప్పుడే తెలిసివస్తోంది.

గౌతమ్ మోటారు బైకు వెనక సీటుపైన కూర్చుంటూ తిరిగి చూశాను.

ప్రహరీగోడ కవతలి తెల్లరంగు మిద్దెయిల్లు నాకు పెద్ద పంజరంలా కనబడ సాగింది.

*తెలుగు వెలుగు మాసపత్రిక*
*సెప్టెంబరు 2018*

*




**మధురాంతకం నరేంద్ర** 16 జులై 1957న జన్మించారు. వీరి మొదటి కథ *చివరికి దొరికిన జవాబు* 1975లో ఎస్.వి. గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజి మేగజైన్‌లో అచ్చయ్యింది. *కుంభమేళా, అస్తిత్వానికి అటూ- ఇటూ, రెండేళ్ల పధ్నాలుగు* కథాసంపుటాలు, ఐదు నవలలు ప్రచురిం చారు. *కథావార్షిక*కు సహసంపాదకులు. *తాత్త్విక కథలు* సంకలనానికి సంపాదకులు. ఎస్.వి. యూనివర్సిటీలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా రిటైరయ్యారు.

*చిరునామా: **15-54/1, శ్రీ పద్మావతీ నగర్, తిరుపతి - 517 502***
*ఫోన్: **98662 43659** manarendra@gmail.com*